సోలార్ ప్యానెల్స్‌కు చెల్లు!

- జపాన్‌లో 'పెరోవ్‌స్కైట్' ప్యానల్స్ అందుబాటులోకి..
- ఏకబిగిన 30 ఏండ్లపాటు లైటింగ్.. ధర కూడా తక్కువ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఆగస్టు 15 (నమస్తే తెలంగాణ): పర్యావరణానికి హాని చేయకుండా కరెంటును ఉత్పత్తి చేసేవిగా పేరొందిన సోలార్ ప్యానెల్స్ భవిష్యత్తులో ఇకపై కనిపించకపోవచ్చు. జపాన్‌లో ఇప్పటికే వీటి వాడకాన్ని తగ్గించేశారు. సంప్రదాయ సోలార్ ప్యానెల్స్ స్థానంలో పెరోవ్‌స్కైట్ అనే కొత్త ప్యానెల్స్‌ను తీసుకొచ్చారు. తక్కువ ధరలో ఎక్కువ కరెంటు ఉత్పాదకతే లక్ష్యంగా వీటిని తీసుకొచ్చినట్టు పరిశోధకులు చెప్తున్నారు.

ఏమిటీ 'పెరోవ్‌స్కైట్ ప్యానెల్స్'?

సోలార్ ప్యానెల్స్ సాధారణంగా సిలికాన్ మెటీరియల్‌తో తయారు చేస్తారు. అయితే పెరోవ్‌స్కైట్ ప్యానెల్స్‌ను కాల్షియమ్ టైటానేట్ అనే మెటీరియల్‌తో తయారు చేస్తారు. ఇదీ సెమీకండక్టర్. వెలుతురిని గ్రహించి దాని తీవ్రతను రెట్టింపు చేయడమే కాదు ప్రత్యేక కెపాసిటర్లలో ఎక్కువకాలం స్టోర్ చేసుకొనే సదుపాయమూ దీంట్లో ఉన్నది. 30 ఏండ్లపాటు ఏకబిగిన కరెంటును ఉత్పత్తి చేసే ఈ పెరోవ్‌స్కైట్ ప్యానెల్స్ ధర.. సంప్రదాయ సోలార్ ప్యానెల్స్ కంటే ఎంతో తక్కువ.

'సోలార్ ప్యానెల్స్' కంటే ఎలా మెరుగు??

రెండు గదుల ఇంట్లో ఉండే ఫ్రిజ్, వాషింగ్ మెషీన్, నాలుగు ఫ్యాన్లు, ఐదు బల్బులకు విద్యుత్తును సరఫరా చేయాలంటే 2కిలోవాట్ సోలార్ ప్యానెల్ అవసరం. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని కలుపుకొన్నప్పటికీ దీని కొనుగోలుకు రూ. 60 వేలు ఖర్చు చేయాలి. సూర్యకాంతి ఉన్నప్పుడే ఇవి పని చేస్తాయి. స్టోరేజీ ప్రాబ్లమ్స్ ఉన్నాయి. వీటిని అమర్చడానికి ప్రత్యేకంగా ఇంటి పైకప్పు అవసరం. రాళ్లవాన, పిడుగులు పడినప్పుడు నాశనమయ్యే ప్రమాదం ఉన్నది. అయితే, పెరోవ్‌స్కైట్ ప్యానెల్స్‌లో ఈ సమస్యలు లేవు. వీటి ధర చాలా తక్కువ. ఎనర్జీ స్టోరేజీ ప్రాబ్లమ్స్ లేవు. ఇంటి పైకప్పు మీదనే అమర్చాల్సిన అవసరం లేదు. వెలుతురు పడే ఎక్కడైనా బిగించవచ్చు. కాల్షియమ్ టైటానేట్‌తో తయారైన ప్రత్యేక ఫిల్మ్ ఎంతో ధృడమైనది. రాళ్ల వానవంటివి ఈ ప్యానెల్స్‌ను నాశనం చేయలేవని పరిశోధకుల అభిప్రాయం. రష్యాలోని కొన్ని నగరాల్లోనూ ఈ తరహా ప్యానెల్స్ వినియోగం పెరిగినట్టు నిపుణులు చెప్తున్నారు.



అట్టారి సరిహద్దువద్ద రైతుల ట్రాక్టర్ ర్యాలీ

అన్నదాతల ట్రాక్టర్ మార్చ్

పంజాబ్, హర్యానాలో కదం తొక్కిన రైతులు

అమృత్‌సర్, హోషియాపూర్, ఆగస్టు 15: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లోని చాలా ప్రాంతాల్లో రైతులు ట్రాక్టర్ మార్చ్ నిర్వహించారు. పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడంతోపాటు తమ డిమాండ్లను పరిష్కరించాలని వారు కేంద్రాన్ని కోరారు. సంయుక్త కిసాన్ మోర్చా(రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చా తదితర రైతు సంఘాలు ఈ మార్చ్‌ను నిర్వహించాయి. అమృత్‌సర్‌లో జాతీయ జెండాలను అలంకరించిన 600 ట్రాక్టర్లతో రైతులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. రైతు నాయకుడు సర్వణ్ సింగ్ పంధేర్ నేతృత్వంలో 30 కిలోమీటర్ల మేర ఈ ర్యాలీ సాగింది. తమ డిమాండ్లు నెరవేరే వరకు శంభు, ఖన్నూరి వద్ద తమ నిరసనలను కొనసాగిస్తామని రైతులు స్పష్టం చేశారు. ఢిల్లీ చలో మార్చ్ జరిగి 200 రోజులు పూర్తయ్యే సందర్భంగా ఈ నెల 31న శంభు, ఖన్నూరి సరిహద్దుల్లో మహా పంచాయత్‌లు నిర్వహిస్తామని తెలిపారు.

నేడే ఎస్ఎస్ఎల్వీ డీ3 ప్రయోగం

శ్రీహరికోట, ఆగస్టు 15: చిన్న చిన్న శాటిలైట్లను అభివృద్ధి చేయటం, అందుకు అనుకూలమైన పేలోడ్ పరికరాలను రూపొందించే లక్ష్యంలో భాగంగా ఇస్రో చేపట్టిన 'ఎస్ఎస్ఎల్వీ-డీ3' మిషన్ రాకెట్ ప్రయోగానికి సర్వం సిద్ధమైంది. శుక్రవారం శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి ఉదయం 9.19 గంటలకు ప్రయోగిస్తున్న రాకెట్ కౌంట్‌డౌన్ మొదలైంది. 'ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్' ఈవోఎస్-08ను తక్కువ ఎత్తులోని భూ కక్ష్యలోకి ప్రవేశపెట్టడం ఈ మిషన్ లక్ష్యం. దాదాపు 6 నెలల తర్వాత ఇస్రో చేపడుతున్న రాకెట్ ప్రయోగమిది. కేవలం రెండు రోజుల ప్రణాళికతో చిన్న చిన్న శాటిలైట్స్‌ను తక్కువ ఖర్చుతో భూ కక్ష్యలోకి చేర్చేందుకు ఎస్ఎస్ఎల్వీ-డీ3 రాకెట్‌తో సాధ్యమవుతుందని ఇస్రో మాజీ సైంటిస్టు ఒకరు చెప్పారు.

12 రోజులు డిజిటల్ అరెస్ట్

ఐఐటీ ప్రొఫెసర్‌కు 12 లక్షలు టోకరా

జైపూర్: మనీ లాండరింగ్ కేసు పేరుతో ఐఐటీ జోధ్‌పూర్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను(35) మోసగించిన సైబర్ నేరగాళ్లు ఆమెను 12 రోజుల పాటు డిజిటల్ అరెస్ట్ చేసి సుమారు రూ.12 లక్షలను దోచుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. బాధితురాలి పేరుతో ముంబైకు డ్రగ్స్‌తో కూడిన పార్సిల్ వచ్చిందని.. అందులో చాలా పాస్‌పోర్ట్‌లు, క్రెడిట్ కార్డులు ఉన్నాయని బెదిరించిన నేరగాళ్లు ఆమెను తమ పర్యవేక్షణలో ఉండాలని.. లేదంటే అరెస్ట్ చేయక తప్పదని బెదిరించి ఈ మోసానికి పాల్పడ్డారు. బాధితురాలికి ఈ నెల 1న వేర్వేరు ఫోన్ నెంబర్ల నుంచి ఈ బెదిరింపు కాల్స్ వచ్చాయి. దీంతో భయపడిన బాధితురాలు వారు చెప్పినట్టు చేస్తూ వచ్చారు. నేరగాళ్లు ఆమె ఫోన్‌లో కెమెరాను ఆన్‌లో ఉంచి ఆమెను నిరంతరం పర్యవేక్షించారు. ఫోన్ స్క్రీన్ షేర్ చేయించుకొని ఆమె ఫోన్‌ను నియంత్రణలోకి తీసుకొన్నారు. స్కైప్ యాప్ ద్వారా ఆమె ల్యాప్‌ట్యాప్‌నూ నియంత్రించారు. దీంతో ఆమె ఎవరినీ సంప్రదించలేకపోయారు. పది రోజుల తర్వాత ఆమె బ్యాంక్ ఖాతా వివరాలు తీసుకొన్న నేరగాళ్లు మంగళవారం సుమారు రూ.12 లక్షలను చెక్ ద్వారా ఆర్టీజీఎస్ విధానంలో బదిలీ చేయించుకున్నారు. ఆ తర్వాత బాధితురాలి ఫోన్, ల్యాప్‌ట్యాప్‌పై తమ యాక్సెస్ తొలిగించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

వారానికో రోజు ఆఫీసుకొస్తే..

ఇలాగే వెనుకబడతాం

ఏఐ రేసుపై గూగుల్ ఇకనైనా దృష్టిసారించాలి: మాజీ సీఈవో ఎరిక్

న్యూఢిల్లీ, ఆగస్టు 15: అంతర్జాతీయ ఐటీ దిగ్గజం గూగుల్‌లో 'వర్క్ ఫ్రం హోం' విధానాన్ని కొనసాగించడంపై ఆ సంస్థ మాజీ సీఈవో ఎరిక్ స్మిత్ విమర్శలు గుప్పించారు. ఓపెన్ ఏఐ లాంటి స్టార్టప్‌లతో పోలిస్తే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రేసులో గూగుల్ చాలా వెనుకబడిపోయిందని, 'వర్క్ ఫ్రం హోం' విధానం, ఉద్యోగులు వారానికి ఒక రోజు మాత్రమే ఆఫీసుకు రావడమే ఇందుకు ముఖ్య కారణమని పేర్కొన్నారు. ఇటీవల స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీలో జరిగిన ఓ చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ జీవితాన్ని సమతూకంగా ఉంచాలని గూగుల్ నిర్ణయించిందని, ఉద్యోగులు గెలవడం కంటే త్వరగా ఇంటికి వెళ్లడం, ఇంటి నుంచి పనిచేయడం చాలా ముఖ్యమైపోయిందని అన్నారు. ఈ మార్పు గూగుల్‌కు ప్రతికూలంగా మారిందని, మిగతా టెక్ కంపెనీల్లో ఉద్యోగులు గంటల తరబడి గొడ్డుచాకిరీ చేస్తూ కొత్త ఆవిష్కరణలతో గూగుల్‌కు పోటీ ఇస్తున్నారని చెప్పుకొచ్చారు. ఏఐ రేసులో వెనుకబడటంపై గూగుల్ ఇప్పటికైనా దృష్టి సారించాల్సిన అవసరమున్నదని స్పష్టం చేశారు.

సామాజిక మాధ్యమాలపై దావా

ప్రజలను వ్యసనపరులుగా మారుస్తున్నాయని ఆరోపణ

టొరంటో: ప్రస్తుతం సమాజంలో చాలా మంది సామాజిక మాధ్యమాలకు బానిసలుగా మారిపోతున్నారు.కెనడాలోని మాంట్రియల్‌కు చెందిన ఒక యువకుడు వీటిపై చర్య కోరుతూ న్యాయస్థానంలో దావా వేశాడు. టిక్ టాక్, యూట్యూబ్, రెడ్డిట్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లపై తీవ్ర ఆరోపణలు చేశాడు. వ్యసనపరులుగా మార్చడమే కాక, వాటి కారణంగా పౌరుల మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతున్నదని ఆరోపించాడు. 2015 నుంచి తాను సామాజిక మాధ్యమాలను వినియోగిస్తున్నానని, వీటి వల్ల ఉత్పాదకత, శరీరంలో పలు సమస్యలు ఏర్పడ్డాయని ఆరోపించాడు.

3 లక్షలమంది డాటా గల్లంతు

గూగుల్ క్రోమ్, మైక్రోసాఫ్ట్ యూజర్లకు హ్యాకర్ల దెబ్బ

న్యూఢిల్లీ: ప్రముఖ సెర్చ్ ఇంజిన్ గూగుల్ క్రోమ్, మైక్రోసాఫ్ట్ ఎడ్జ్ యూజర్లను హ్యాకర్లు టార్గెట్ చేసుకున్నారని, ఫేక్ బ్రౌజర్ ఎక్స్‌టెన్షన్లతో యూజర్ల కంప్యూటర్లలో మాల్‌వేర్‌ను ప్రవేశపెడుతున్నారని పరిశోధకులు తాజాగా హెచ్చరించారు. ప్రమాదకర ఎక్స్‌టెన్షన్లను డౌన్‌లోడ్ చేసుకోవటం ద్వారా దాదాపు 3లక్షలకు పైగా గూగుల్ క్రోమ్, మైక్రోసాఫ్ట్ యూజర్ల కంప్యూటర్లు ప్రభావితమయ్యాయని సైబర్ సెక్యూరిటీ కంపెనీ 'రీజన్‌ల్యాబ్స్' తాజా నివేదిక పేర్కొన్నది. దీంతో యూజర్ల వ్యక్తిగత డాటా, ఆర్థిక సమాచారం, పాస్‌వర్డ్‌లు హ్యాకర్ల చేతికి చిక్కాయని నివేదిక తెలిపింది. ప్రమాదకర ఎక్స్‌టెన్షన్లతో హ్యాకర్లు మరిన్ని దాడులు జరపవచ్చునని హెచ్చరించింది.

పిడుగుపాటుతో వ్యవసాయ కూలీ మృతి

- మరొకరికి స్వల్ప గాయాలు

తాండూర్, ఆగస్టు 15 : తాండూర్ మండలంలోని అచ్చలాపూర్ గ్రామ శివారులోని పంట చేనులో పిడుగుపాటుకు గురై వ్యవసాయ కూలీ ఇట్యాల అంజయ్య (36) మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం..కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం కొమురవెల్లి గ్రామానికి చెందిన అంజయ్య కొంతకాలంగా భీమిని మండలం రాంపూర్‌లో నివాసం ఉంటూ కూలీ పనులకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం అచ్చులాపూర్‌కి చెందిన పొట్లపల్లి రాజిరెడ్డికి చెందిన పత్తి చేనులో క్రిమిసంహారక మందు పిచికారీ చేసేందుకు వెళ్లాడు. సాయంత్రం సమయంలో ఒక్కసారిగా భారీ వర్షంతో పాటు పిడుగులు పడ్డాయి. ఆ పిడుగుపాటుకు అంజయ్య అక్కడి కక్కడే మృతి చెందగా, చేను యజమాని భార్య మల్లక్క కూడా పిడుగుపాటు తాకిడికి స్వల్ప గాయాలపాలై అస్వస్థతకు గురయింది. దీంతో మల్లక్కను చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు. అంజయ్య మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు అంబులెన్స్ రాగా, మృతుడి కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. చేను యజమాని తమకు నష్టపరిహారం చెల్లించే వరకు మృతదేహాన్ని తరలించేది లేదని తేల్చి చెప్పడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కుటుంబ సభ్యులతో మాట్లాడి సముదాయించినా వినలేదు. తమకు న్యాయం చేయాలని భీష్మించుకు కూర్చున్నారు.

కూలిన హాస్టల్ పైకప్పు సీలింగ్

- భయందోళనలో విద్యార్థులు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, ఆగస్టు 15 : జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల విద్యార్థినులు ఉంటున్న హాస్టల్ (పాత ఎస్పీ భవనం) సీలింగ్ కొంత భాగం ఊడిపోయి కింద పడిపోయినట్లు విద్యార్థినులు తెలిపారు. విద్యార్థినులు తెలిపిన వివరాల ప్రకారం..గురువారం ఉదయం ఒక్కసారిగా సీలింగ్ ఊడిపాయి కింద పడిపోయిందని ఆ సమయంలో గదిలో ఎవరూ లేకపోవడం ప్రమాదం తప్పిందని తెలిపారు. నిత్యం హాస్టల్‌లో ఏదో ఒక సమస్య ఉంటుందని భయందోళనలో ఉంటున్నామని ఉన్నతాధికారులు స్పందించి హాస్టల్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ విషయమై కళాశాల ప్రిన్సిపాల్‌ను ఫోన్‌లో సంప్రదించడానికి ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

కాగజ్‌నగర్‌లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు!

కాగజ్‌నగర్, ఆగస్టు 15: కాగజ్‌నగర్ పట్టణంలోని మద్యం దుకాణాల ఎదుట నిర్వాహకులు మద్యం విక్రయాలు జరపడంపై విమర్శలు వెల్లువెత్తాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మటన్, చికెన్, మద్యం దుకాణాలు బంద్ పాటించాలని ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు చేస్తూ మూసి ఉన్న మద్యం దుకాణం సమీపంలో, ఎదుట కొందరు గురువారం మద్యం విక్రయించారు. ఎమ్మార్పీ ధరకంటే రూ.40 అధికంగా తీసుకుంటూ విక్రయించారు. ఎక్సైజ్ శాఖ అధికారుల పట్టించుకోకపోవడంతోనే మద్యం వ్యాపారులు నిబంధనలు పాటించడం లేదని ఆరోపణలు వెల్లువెత్తాయి.

వినికిడి యంత్రాల అందజేత

దండేపల్లి, ఆగస్టు 15: దండేపల్లి మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు పాఠశాల సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో మర్సుకొల్ల సంజయ్, సాత్విక్ అనే ఇద్దరు బదిరులకు రూ.40వేల విలువైన 4 వినికిడి పరికరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం శంకర్‌గౌడ్, భవిత కేంద్ర ప్రత్యేక ఉపాధ్యాయులు వెంకటేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్ విఠల్, సీఆర్పీ నర్సయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పీఆర్టీయూ జన్నారం మండల అధ్యక్షుడిగా రాజమౌళి

జన్నారం, ఆగస్టు 15 : పీఆర్టీయూ జన్నారం మండల నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు తిరుమల్‌రెడ్డి ఇన్నారెడ్డి సమక్షంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కట్ట రాజమౌళి, ప్రధాన కార్యదర్శిగా నగురు సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడిగా మామిడి నర్సయ్య, ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా విజయ్‌కుమార్, ఎస్ నర్సయ్య, ఎం కిషన్‌రావు, కార్యదర్శులుగా శ్రీదేవి, సరళ, కే సుధాకర్ ఎన్నికైనట్లు తెలిపారు.

గౌడ కార్మికులకు రక్షణ పరికరాల పంపిణీ

హాజీపూర్, ఆగస్టు 15 : మండలంలోని వేంపల్లి గ్రామంలో గురువారం మంచిర్యాల అబార్కీ శాఖ ఆధ్వర్యంలో గౌడ కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన కాటమయ్య సురక్షా కార్యక్రమంలో భాగంగా గౌడ కార్మికులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎక్సైజ్ అధికారి కె జీ నందగోపాల్ మాట్లాడుతూ గౌడ కార్మికులు చెట్లు ఎక్కే సమయంలో ఎలాంటి ప్రమాదాలకు గురికాకుండా ఉండేందుకు రక్షణ పరికరాలతో కూడిన కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల అబార్కీ సీఐ గురువయ్య, బెల్లంపల్లి సీఐ ఇంద్ర ప్రసాద్, చెన్నూర్ సీఐ హరి, లక్షెట్టిపేట సీఐ నర్సింహులు, గౌడ సభ్యులతో పాటు అబార్కీ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ నెల 20 వరకు అభ్యంతరాల స్వీకరణ

ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 15: నూతనంగా ఆసిఫాబాద్, జనకాపూర్, గొడవెల్లి గ్రామాల నుంచి 20 వార్డుల్లో పురపాలక సంఘం ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ భుజంగ రావు గురువారం ప్రకటనలో తెలిపారు. ఆసిఫాబాద్ పురపాలక సంఘాన్ని 20 వార్డులతో సరికొత్త ఓటర్ల ప్రతిపాదికన ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు విభజించినట్లు తెలిపారు. ఈ క్రమంలో ప్రజలకు ఏవైనా అభ్యంతరాలుంటే నేటి నుంచి 20వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా అభ్యంతరాలతో పాటు తెలియజేయాలని కోరారు.

బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటా

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

మన్యం పద్మ ను పరామర్శిస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

రెబ్బెన, ఆగస్టు 15: బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటానని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. రెబ్బెన మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు మన్యం పద్మ కుటుంబంతో పాటు తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు బొడ్డు శంకర్ కుటుంబాన్ని గురువారం రాత్రి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎమ్మెల్యే వెంట పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్, మాజీ ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, మాజీ ఎంపీటీసీ సంగం శ్రీనివాస్, మాజీ డైరెక్టర్ పల్లె రాజేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్ బొమ్మినేని అహల్యాదేవి, బుర్స పోశమల్లు, మాజీ ఉపసర్పంచ్ బొమ్మినేని శ్రీధర్, బీఆర్ఎస్ మహిళా మండల అధ్యక్షురాలు అన్నపూర్ణ అరుణ, బీఆర్ఎస్ నాయకులు దుర్గా రావు, దుర్గం భరద్వాజ్, జుమ్మిడి ఆనందరావు పందిర్ల మధునయ్య లతో పాటు పలువురు ఉన్నారు.

పాఠశాల అటెండర్‌కు పూర్వ విద్యార్థుల సాయం

దండేపల్లి, ఆగస్టు 15: దండేపల్లి మండలంలోని రెబ్బెన్‌పెల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో 2000-2001 సంవత్సరం పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఔదార్యం చాటుకున్నారు. వారు చదువుకున్న సమయంలో పాఠశాలలో అటెండర్‌గా విధులు నిర్వహించిన శనిగారపు రాజలింగు పక్షవాతంతో మంచాన పడిన విషయం తెలుసుకున్న విద్యార్థులు రూ12వేల ఆర్థిక సహాయాన్ని గురువారం ఇంటి వద్దకు వెళ్లి అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అక్కల రాజన్న, చందనగిరి తిరుపతి, పింగిలి మల్లేశ్, కొట్టె కిషన్, కాండ్రపు శ్రీనివాస్, తిరుపతి, ముత్యం నాగవర్మ, గొర్ల సుధకర్, తదితరులు ఉన్నారు.

కొత్త వరిపేటను గ్రామ పంచాయతీగా చేయాలి

కాసిపేట, ఆగస్టు 15 : కాసిపేట మండలంలోని కొత్త వరిపేట గ్రామాన్ని నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కలెక్టర్ దీపక్ కుమార్, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు వినతిపత్రం అందించారు. బెల్లంపల్లిలో జరిగిన గ్రామంలో గ్రామస్తులు వినతిపత్రం అందించారు. పాత వరిపేట, కొత్త వారిపేట, లంబాడీతండా గ్రామాలను కలుపుకొని 480 ఓటర్లు, 700పైగా జనాభా వరకు ఉందని, గ్రామ పంచాయతీ దూరం ఉండడంతో చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందని, మూడు గ్రామాలను కలుపుకొని వెంటనే కొత్త వరిపేటగా నూతన గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, గ్రామస్తులు బానోత్ లక్ష్మణ్, దుర్గం ప్రవీణ్, కొట్టె సతీశ్, బానోత్ దేశాయి తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణ సంస్థ కార్యాలయం ప్రారంభం

సిర్పూర్(టీ), ఆగస్టు 15 : మండలకేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో గురువారం మనవ హక్కుల పరిరక్షణ సంస్థ జిల్లా కార్యాలయాన్ని సిర్పూర్(టీ) ఎస్ఐ దీకొండ రమేశ్ ప్రారంభించారు. అనంతరం సంస్థ సభ్యులకు ఐడీ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల పరిరక్షణ సంస్థ జిల్లా చైర్మన్ తులసీదాసు, జిల్లా కార్యదర్శి మధుకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ వంగరీ ప్రవీణ్, జిల్లా వర్కింగ్ చైర్మన్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

విద్యార్థినికి నగదు పురస్కారం

చెన్నూర్ టౌన్, ఆగస్టు 15 : చెన్నూర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించి అత్యధిక మార్కులు సంపాదించిన అక్షితకు గురువారం నగదు పురస్కారం అందించారు. కీర్తిశేషులు పులి ప్రభాకర్ రావు స్మారకార్థం వారి కొడుకు పులి కిశోర్ కుమార్ సహకారంతో రూ.10,116 నగదు పురస్కారాన్ని గురుకృప స్పోర్ట్స్ అధ్యక్షుడు కారెంగుల రామయ్య అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యేటా పాఠశాలలో అత్యధిక మార్కులు పొందిన విద్యార్థులకు పులి కిశోర్ ఆర్థిక సహకారంతో నగదు బహుమతిని ఇవ్వడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ హమీద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇక నుంచి ఫోన్‌పే ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లింపు

మంచిర్యాలటౌన్, ఆగస్టు 15: విద్యుత్ బిల్లుల చెల్లింపులు ఇకనుంచి ఫోన్‌పే ద్వారా చెల్లించుకునే అవకాశం ఉందని విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్‌కుమార్ తెలిపారు. త్వరలోనే గూగుల్‌పే ద్వారా కూడా అవకాశం లభిస్తుందని అన్నారు. విద్యుత్ బిల్లుల చెల్లింపుల సమయంలో ఆన్‌లైన్ సంస్థలు ఇకపై ఎలాంటి అదనపు చార్జీలు వసూలు చేయవని తెలిపారు. గతంలో ఫోన్‌పే, గూగుల్‌పే యాప్‌ల ద్వారా చెల్లింపులు ఉండేవని, నెల రోజుల కితం వాటి ద్వారా చెల్లింపులను ఆపివేసినట్లు తెలిపారు. తాజాగా ఫోన్‌పే ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించుకునే వీలు కల్పించడం జరిగిందన్నారు. దీంతోపాటు టీజీఎన్‌పీడీసీఎల్ యాప్ ద్వారా కూడా బిల్లులు చెల్లించవచ్చునని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



DON'T REVEAL THE END!
KHEL KHEL MEIN
PRASADS Necklace Road.
AMB Gachibowli.
Ameerpet.
P